కథ


# పిచ్చివాళ్ళ అగచాట్లు

హిందీ మూలం: పోలి విజయరాఘవరెడ్డి

అనువాదం: డాక్టర్ రాజ్యలక్ష్మి

*"బాబుగారు... ఓ బాబుగారు... మీకు నేను... పెట్టుకున్న అర్జీ అందిందా?" అనే అమాయకపు మాటలు నన్ను వెంబడించటంతో ఒక్కసారిగా నేను వెనక్కి తిరిగి చూసాను. పాండే రొప్పుతూ తన కలవాటైన నడకతో నా దగ్గరకొచ్చాడు. నేను అతగాడికి జవాబు చెప్పేలోగానే తిరిగి అమాయకంగా ఒక్కొక్క మాటనే కూటబలుక్కుంటూ, నంగి, నంగిగా "బాబుగారు.... మీకు నేపెట్టుకొన్న అర్జీ అందిందికదూ?" రేపు నన్ను మీ ఆఫీసుకి రమ్మంటారా?" అంటూ మెడ వంకరగా పెట్టి ఓ ప్రశ్న చిహ్నంలా నా ముందు నిలబడ్డాడు.*

నేను నవ్వుతూ "రేపు ఆదివారం కదా! ఎల్లుండి సోమవారం నాడు కనిపించు" అన్నాను.



"పిచ్చివాడా! నువ్వు పెట్టుకున్న అర్జీ గురించి ఆయన్నే అడుగు. ఆఫీసులో ఈయనకన్నా పెద్ద వాళ్ళు యింకెవరున్నారు? ముందు యితగాడిని సంతోషపెట్టావంటే నీ పని దాదాపు పూర్తయి నట్టే" అన్నాడు ఉపాధ్యాయ్ వచ్చే నవ్వుని ఆపుకుంటూ. అంతటితో ఊరుకుంటే బానే వుండేది. నా వేపు తిరిగి, నవ్వుతూ "రెడ్డిగారు! పాపం, ఈ అమాయకుడికి మీ ఆఫీసులో ఉద్యోగం ఇప్పిస్తే మీ సొమ్మేం పోతుంది చెప్పండి? ఇతగాడు తెలివి గలవాడు,ఆపై కష్టపడి పని చేస్తాడు కూడాను" అన్నాడు మళ్ళీ నవ్వుతూ.

"అవునండి... ఆఫీసులో ప్రతి పని నేచేయగలను" అన్నాడు పాండే ఉపాధ్యాయ్ మాటలకు వంత పాడుతూ. కాసేపు నాకు, ఊబిలో దిగబడిపోతున్నానేమో ననిపించింది. అందుకే నన్ను నేను రక్షించుకోవటానికి "పాండే వేపు తిరిగి "సరే! ఎల్లుండి వచ్చి కనబడు. ఆఫీసర్‌కి నిన్ను పరిచయం చేస్తాను. ఆపై నువ్వు పెట్టుకొన్న అర్జీ గురించి వాకబు చేద్దాం" అన్నాడు ఓ వెర్రి నవ్వు నవ్వుతూ.

ఉపాధ్యాయ్ తానే గెలిచినట్టు పోజు కొడుతూ అక్కడినుంచి మెల్లగా జారుకున్నాడు. కానీ నేను మటుకు అతని వైపు కోపంగా చూడకుండా వుండలేకపోయాను.

"మంచిదండి... ఎల్లుండి... ఆఫీసులో మిమ్మల్ని కలుస్తా" అంటూ పాండే కూరల దుకాణం వరకు నన్ను వెంబడించి తప్పుకున్నాడు. నేను పక్కనే వున్న సుమేర్‌మల్ పాన్ దుకాణం దగ్గర ఆగిపోయాను.

సుమేర్‌మల్ పాన్ కడుతూ "ఆ పిచ్చి వెధవ పాండే మీ వెనకాల పడి మిమ్మల్ని వేధిస్తున్నట్టున్నాడు. ఏం అడుగుతున్నాడేంటీ? అయినా యింకేమడుగుతాడు? ఉద్యోగం యిప్పిచ్చుమని అడిగుంటాడు" అన్నాడు.

"ఆహా! కనిపిస్తే చాలు ఉద్యోగం... ఉద్యోగం... అంటూ ప్రాణాలు తోడేస్తున్నాడు అక్కడికవేమో చెట్లకి కాస్తున్నట్టు. ఇతగాడు ఓ సమస్యయి కూర్చున్నాడనుకో. దానికి తోడు ప్రతివాళ్ళు ఇతన్ని రెచ్చగొట్టి నా పైకి ఉసిగొల్పుతున్నారు. జరిగిందంతా నువ్వు గమనిస్తూనే వున్నావు కదా! నేను అతనితో మాట్లాడుతుంటే ఎక్కడినుంచో వచ్చి వూడిపడ్డాడు ఉపాధ్యాయ్. వచ్చినవాడు వూరుకున్నాడా అంటే అదీ లేదు.

"యితగాడికన్నా పై అధికారి ఎవరూ లేరు. ముందు ఈయనగార్ని సంతోషపెట్టావంటే నీ పని యిట్టే అయిపోతుందంటూ ఆ వెర్రివాడ్ని రెచ్చగొట్టాడు.

పాన్ చేతిలో పెడుతూ సుమేర్‌మల్ "మీరు చెప్పేది నిజమే కాదనను, కానీ బాబుగారు, అతగాడు మరీ అంత వెర్రివాడు, పిచ్చివాడు కాదండి. పేటలో తిరిగే రౌడీమూకే పాండేని వెర్రివెధవని చేసి ఆడిస్తున్నారు" అంటూ నా వేపు తిరిగి మాటలు పొడిగిస్తూ "ఏం చెప్పమంటారు చెప్పండి! రోజు రోజుకి ఆ ఆకతాయి మూక అల్లరి పెచ్చుపెరిగిపోతోంది. పనీ, పాట లేక వూరి మీద పడి తిరుగుతూ ఏదో ఓటి చేయందే వీళ్ళకి తోచదు. ఈ రౌడీమూక అల్లర్ల గురించి విని, వీళ్ళ ఆకతాయి చేష్టలు చూసి అలసిపోయానంటే నమ్మండి. గాంధీనగర్ పేరు మట్టిలో కలిపేదాక నిద్రపోయేలా లేరు వీళ్ళు.

"అదేంటి! మొదట్లో గాంధీనగరం ఇలా వుండేది కాదే?" అన్నాను నేను పాన్ నములుతూ. నా మాటలు పూర్తి కాకుండానే సుమేర్‌మల్ "రెండేళ్ళక్రితం వరకు ఈ పేటలో రౌడీమూక ఆకతాయితనాలు వుండేవి కాదు. కానీ వజీర్‌పురా మూక మనవాళ్ళని కూడా రౌడీవెధవల్లా తయారు చేసారంటే నమ్మండి. ఆగ్రాలో వజీర్‌పురాకి ఎంత మంచి పేరుందో మీకు తెలియంది కాదు కదా!"

"అదీ అలా చెప్పు! అందుకే ఈ మధ్య మన పేటలో కూడా తరచూ అల్లర్లు మొదలయ్యాయి అంటూ పాన్ వుమ్మేసి ఎదురుగా చూసేసరికి పాండే వస్తూ కనిపించాడు. అంతే "వుంటాను" అంటూ అక్కడినుంచి జారుకుని మెట్లెక్కి నా గదిలోకి చేరుకున్నాను.


సిగరెట్ ముట్టించి, కుర్చీలో చేరగిలిపడ్డాను. ఈరోజు రెండవ శనివారం. ఆఫీసుకి శలవు. రేపు ఆదివారం కాబట్టి ఆఫీసుకి వెళ్ళే అవసరం లేదు. ఎల్లుండి సోమవారం. ఆఫీసుకి పోక తప్పదు. సోమవారం గుర్తుకి రాగానే పాండే స్మృతిపథంలో మెదిలాడు. "పాపం పాండే పెద్దా, చిన్నా భేదం లేకుండా అంతా అతన్ని పిచ్చివాడంటూ ఆటలు పట్టిస్తారు. అంతటితో వూరుకుంటారా? అతగాడు విసుక్కున్నకొద్దీ పిల్లలు మరింత విసిగించి ఆనందిస్తూ వుంటారు. వాళ్ళ తాకిడికి తట్టుకోలేని పాండే పరుగు లంకించుకుంటాడు. పిల్లలు అతన్ని వదలకుండా తరుముకుంటూ వెళతారు. దోవలో పెద్దవాళ్ళెవరైనా కనిపిస్తే పాండే పిల్లలు తనని విసిగిస్తున్నారంటూ వాళ్ళ గురించి ఫిర్యాదు చేస్తాడు. వాళ్ళు పిల్లల్ని కోప్పడి అక్కడినుంచి వెళ్ళగొడుతూ వుంటారు. మరి పెద్దలే అతన్ని ఆటలు పట్టిస్తే ఏం చేయగలుగుతాడు? ఏం చేయలేక తనలో తనే బాధపడుతూ వుంటాడు. సిగరెట్ తీసుకొని పాండే గురించి ఆలోచిస్తున్న నా నోట్లోంచి "పాపం! అమాయకుడు" అన్న మాటలు నాకు తెలియకుండానే బయటికొచ్చాయి.

నా వెనకాల ఏదో చప్పుడు కావటంతో ఒక్కసారి ఈ లోకంలోకి వచ్చిపడ్డాను. కుర్చీలో కూర్చున్న నేను వెనక్కి తిరిగి చూసాను. అలమరలో పుస్తకాలమీద పెట్టిన అద్దం ఎదురుగా కూర్చున పిచ్చుక దాన్ని ముక్కుతో పొడుస్తోంది. అది అద్దంలో కనిపిస్తున్న మరో పిచ్చుకని ప్రేమతో ముద్దాడుతోందో, లేక కోపంతో పొడుస్తోందో నాకు అర్థం కాలేదు. బహుశా అలసిపోయిందేమో, ముక్కుతో పొడవడం ఆపి అటు-ఇటు చూడటం మొదలెట్టింది. ఆతరువాత షరా మామూలే! కట్...కట్...నేను నెమ్మదిగా లేచి అలమర దగ్గరకెళ్ళాను. నన్ను చూసి కాబోలు అది కాస్తా తుర్రుమంటూ ఎగిరిపోయింది. అద్దాన్ని తలకిందులుగా పెట్టి మళ్ళీ నేను యథాస్థానాని

కొచ్చి సిగరెట్ తాగడం మొదలెట్టాను.

"పాపం పిచ్చుక... దానికి తన రూపమే అద్దంలో కనిపిస్తోందని తెలియదు కదా! దానికి ఆ విషయాన్ని అర్థమయ్యేలా చెప్పగలిగితే ఎంత బాగుంటుంది. భాష సమస్య అయి కూర్చుంది కానీ లేకపోతేనా...! ఒక వేళ చెప్పగలిగినా సరైన పదాలు కావాలి కదా! భాష రాకపోవడం వల్లనే కదా దానికి జ్ఞానం లేకుండా అలా పొడుస్తోంది. బుద్ధి-జ్ఞానం వుంటే ఎందుకదలా అద్దాన్ని టక్కు- టక్కు అంటూ పొడుస్తుంది? చెప్పండి! ముక్కుతో అద్దాన్ని అలా పొడిచి అలిసిపోయినా పట్టువదలని విక్రమార్కుడిలా ఆ పిచ్చిది తన పట్టు మాత్రం వదలడం లేదు.

"పిచ్చి" ఆ మాట నా స్మృతిపథంలో మెదలగానే పాండే రూపం నా కళ్ళ ఎదురుగా వచ్చి నిలబడింది. సిగరెట్ చివరిసారిగా పీల్చి బయటపడేసిన, నన్ను రకరకాల ఆలోచనలు చుట్టుముట్టాయి. "నిజంగా పిచ్చివాళ్ళకి తెలివితేటలు తక్కువగా వుంటాయా? బుద్ధిమాంద్యం వున్నవాళ్ళనే పిచ్చివాళ్ళంటారా? కానీ పాండేని తెలివితక్కువ వాడనటానికి వీలు లేదు. అతగాడు అందరిలాగానే ప్రవర్తిస్తాడు. పైగా ఉద్యోగం కోసం చెప్పులరిగేలా తెగ తిరుగుతున్నాడు. ఉద్యోగ వేటలో అతను ఎన్నో ఎదురుదెబ్బలు తిని కూడా వుండచ్చు. బహుశా అందరినీ మెప్పించేలా మాట్లాడలేకపోవటం మూలానే వుద్యోగం దొరికివుండకపోవచ్చు. అంతేకాదు ఆగి-ఆగి, నంగి-నంగిగా మాట్లాడటం వల్లే జనులంతా అతన్ని పిచ్చివాడనుకుంటున్నారేమో!! అతని మెదడులోనే ఏదైనా లోపం వుండటం మూలానా అతను అందరిలా ప్రవర్తించలేకపోతున్నాడేమో!!!" పాండే గురించి ఆలోచిస్తుంటే రకరకాల ప్రశ్నలు నాలో తలెత్తడం మొదలెట్టాయి. మాటలు సరిగ్గా మాట్లాడలేకపోవటంవల్ల దాని ప్రభావం మెదడుమీద వుంటుందా లేదా మెదడు సరిగ్గా పనిచేయకపోవటం వల్లే అందరిలా మాట్లాడలేకపోతున్నాడా? నా ఈ ప్రశ్నలకి జవాబు "సైకో లింగ్విస్ట్" లేదా "పైథలాజిస్ట్ అదీ కాకపోతే "స్పీచ్ థెరపిస్ట్"లు మాత్రమే చెప్పగలుగుతారు. ఇలా పాండే గురించి ఆలోచించి, ఆలోచించి అలసిపోయిన నేను కాసేపు మౌనంగా వుండిపోయాను.



నా మౌనానికి భంగం కలిగిస్తూ బయట పెద్దగా అరుపులు వినిపించాయి. మొదట నేను బయటికెళ్ళి ఆ గొడవ తాలూకు విషయాన్ని తెలుసుకుందామని అనుకున్నాను. కానీ అంతలోనే సుమేర్‌మల్ మాటలు గుర్తుకొచ్చి ఆగిపోయాను. అదేనండి బాబు! యిందాక వజీర్‌పురా రౌడీమూక గురించి చెప్పాడు కదా సుమేర్‌మల్. రెండేళ్ళ కిందటి వరకు ప్రశాంతంగా వున్న మా గాంధీనగరం అల్లరిమూక ఆగడాలతో అట్టుడికిపోవటం నాకు ఆశ్చర్యాన్ని కలిగించిన మాట వాస్తవమే! వజీర్‌పురా ఆగ్రాలోనే పేరు పొందిన ప్రాంతం. వజీర్‌పురా మీద సుమేర్‌మల్‌కి కోపం రావటానికి కారణం ఏమై వుంటుంది? గాంధీనగర్‌లోని పిల్లల్ని ఆకతాయిల్లా వీళ్ళు ఎందుకు తయారుచేస్తున్నట్టు? ఆలోచనలతో నా బుర్ర తిరగటం మొదలెట్టింది. నాలో తలెత్తిన ప్రశ్నలకి సమాధానం వెతకటం మొదలెట్టాను. బహుశా వజీర్‌పురా రౌడీమూక, సుమేర్‌మల్‌ని బాగా విసిగించివుంటారు. విసిగించటమంటే పాన్ తిని డబ్బులు యిచ్చివుండకపోయుండచ్చు. కానీ అలా చేసి వుంటారంటారా వాళ్ళు? కారణం సుమేర్‌మల్ లాంటి మంచి వ్యక్తితో కూడా అలా ప్రవర్తించే వాళ్ళుంటారా ఈ లోకంలో!!!

వజీరపురా ఆగ్రాలోని ఓ పురాతన ప్రాంతం. ఆగ్రాలోని మొగలాయి వంశం గురించి ఎవరైనా రాయాలనుకుంటే వజీర్‌పురాని చూస్తే చాలు అంతా అర్థం అయిపోతుంది. కారణం యిప్పటికీ ఆ ప్రాంతం మొగలాయి వంశానికి ప్రతీకగానే వుంటుంది. ఆ పాత గల్లీలు, బూజుపట్టిన భావాలు గల ఆ వ్యక్తులు, పావురాల పందాలు, వీటన్నిటిని మించి ఓ వింత దుర్గంధం వెరసి వజీర్‌పురా అవుతుంది. ఆగ్రా ఓ శరీరమైతే వజీర్‌పురా దుర్గంధ పూరితమైన ఓ వ్రణంలాంటిది. అందుకే సుమేర్‌మల్ లాంటి మంచి వ్యక్తులు వజీర్‌పురాని దుయ్యబడితే అందులో ఆశ్చర్యపడాల్సింది ఏదీ లేదు. యికపోతే గాంధీనగరం, కొత్త దశాబ్దంలో నిర్మించబడింది. ఆధునిక సభ్యతకి దగ్గరగాను, వజీర్‌పురాకి దూరంగాను వుంది. కాకపోతే రెండు ప్రాంతాలమధ్య వున్న కొన్ని స్థలాల కారణంగా రెండింటి మధ్య వున్న ఎల్లల్ని కనుక్కోవటం కష్టమే. బహుశా 'డిబ్యూసల్' కూడా దీని గురించి చెప్పలేదేమో! అలా రెండు ప్రాంతాలు కలిసున్న చోటుకి దగ్గరగా సుమేర్‌మల్ పానుషాపు, ప్రస్తుతం నేనుంటున్న యిల్లు వున్నాయి. వజీర్‌పురాలో వుండేవాళ్ళు అప్పుడప్పుడు గాంధీనగర్‌లో కనిపిస్తూనే వుంటారు. గాంధీనగర్ వచ్చినప్పుడల్లా ఓ నగరంలోకి వచ్చిన అనుభూతి కలుగుతూ వుంటుంది. బహుశా అందుకే కాబోలు వజీర్‌పురాలోని చాలా మంది వ్యాపారస్థులు గాంధీనగర్‌లో తమ-తమ వ్యాపారాలని హాయిగా కొనసాగించుకుంటున్నారు. గాంధీనగర్‌లో వ్యాపారాలు చేసుకుంటున్నప్పటికి వ్యాపారస్థులంతా వజీర్‌పురాలోని తమ పాత యిళ్ళల్లోనే వుంటున్నారు. కొద్దిరోజుల క్రితం అనుకుంటాను సుమేర్‌మల్ పాన్‌షాపు కెదురుగా మరొక పానుషాపు వెలిసింది. ఆ పాన్‌షాపుని తెరిచింది మరెవరో కాదు వజీర్‌పురాలో వుండే దౌలత్‌సింహ్ అనే వ్యక్తి. దానితో వజీర్‌పురా నుంచి వచ్చేవాళ్ళంతా అతని దగ్గరే పాను కొనుక్కొని తినటం మొదలెట్టారు. వాళ్ళని చూసి గాంధీనగర్‌లో వాళ్ళు కూడా మెల్లమెల్లగా అతని దగ్గరే పాన్ కొనటం ప్రారంభించారు. దానితో సుమేర్‌మల్ కడుపు రగిలింది. బహుశా సుమేర్‌మల్ కోపం వజీర్‌పురామీద కన్నా వజీర్‌పురాలో వుండే వ్యక్తి తెరిచిన ఆ పాన్‌షాపు మీదే వుండివుంటుంది. అందుకే దౌలత్‌సింహ్‌తోపాటు వజీర్‌పురాలో వుండేవాళ్ళమీద అతనికి కోపం, ఈర్ష్యా పెచ్చుపెరిగిపోయాయి. వజీర్‌పురాలో వాళ్ళు అతగాడికి రౌడీమూకలుగాను, గాంధీనగర్‌లోని పిల్లల్ని పాడుచేసే వాళ్ళలాగాను కనిపించటంలో ఆశ్చర్యం ఏమీ లేదు. అసలు రహస్యం తెలిసాక నామీద నాకు రవ్వంత గర్వం కలిగింది. గర్వంతోపాటుగ సుమేర్‌మల్ మీద జాలి కూడ వేసిందంటే నమ్మండి.

కుర్చీలోంచి లేచి ఈల వేసుకుంటూ తిరుగుతున్న నాకు బయట అరుపులు మరీ పెద్దగా వినిపించటం మొదలెట్టాయి. నేను గదిలోంచి బయటికొచ్చి అరుపులు వినిపిస్తున్న వేపుగా చూసాను. ఓ పెద్ద గుంపు ఎదురుగా వున్న సందులోంచి చౌరస్తా వేపుగా వెళుతూ వుండటం చూసాను. కొంతమంది చేతుల్లో లాఠీలు వుండటం కూడా నేగమనించాను. పెద్ద పెద్దగా అరుస్తూ వుండటంతో అసలు విషయమేమిటో బొత్తిగా అర్థం కావటం లేదు. లాభం లేదనుకుని నేను గబ-గబా కిందకి దిగొచ్చి చౌరస్తా వేపుగా నడిచాను. నేవెళ్ళేసరికి చౌరస్తా దగ్గరకొచ్చిన జనసందోహం కాస్తా ముగ్గురు ముగ్గురుగా విడిపోయి మాట్లాడుకోవటం మొదలెట్టారు. అంతేకాదు కొద్దిసేపట్లో గాంధీనగర్‌లోని ప్రతి దుకాణం ముందు చిన్న గుంపు తయారైంది. ప్రతి గుంపులో వాళ్ళు "ఆ విషయం" గురించి చర్చించుకుంటున్నారు.

నేను కూడా జరిగిందేంటో తెలుసుకోవాలనే ఉత్సుకతతో ఆ గుంపులో కలిసిపోయాను. సుమేర్‌మల్ పానుషాపు దగ్గర ఎంతోమంది పరిచితులు నాకు కనిపించారు.

"ఎంత విచిత్రం! అసలు అంత ధైర్యం ఆ వెధవకి ఎక్కడినుంచి వచ్చింది?"

"అదృష్టం బాగుంది కాబట్టి బతికి పోయాడు, లేకపోతే తెలిసొచ్చేది"

"శర్మగారు వెనకనుంచొచ్చి లాఠీ లాక్కున్నారు కాబట్టి సరిపోయింది, లేకపోతే వాడి బుర్ర రామకీర్తన పాడుండేది".

"నిజం చెప్పాలంటే శర్మగారే వాడి ప్రాణాలు రక్షించారు".

"శర్మగారు ఆ విశ్వనాథ్‌ని ఓ పక్క ఆపుతుంటే అమర్‌నాథ్, విశ్వనాథ్ మీదకి విరుచుకుపడుతున్నాడు".

"అవునవును, యింతలో హారీలాల్ వచ్చి అమర్‌నాథ్‌ని గట్టిగా పట్టుకొని యింట్లోకి తీసుకెళ్ళారు'.

"ఆ తర్వాత శర్మ, జీవన్‌లాల్ యిద్దరూ కలిసి విశ్వనాథ్‌ని కష్టపడి శర్మగారింట్లోకి బలవంతంగా తీసుకెళ్ళారు.

"ఇంతమంది వున్నా కూడా లాఠీ తీసుకొని గుంపులోకి జొరబడే ధైర్యం అమర్‌నాథ్‌కి ఎలా వచ్చిందో నాకు బొత్తిగా అర్థం కావటం లేదు" అన్నాడు రామ్‌బాబు. అతని మాటలకి సమాధానంగా మోహన్‌లాల్ చావు ఎదురుగుండా వచ్చి నిల్చుంటే ధైర్యం దానంతటదే వస్తుంది" అన్నాడు.

వాళ్ళేం మాట్లాడుకుంటున్నారో నా కసలు బొత్తిగా అర్థం కావటం లేదు. ఇక నేను ఆగలేక "ఎందుకింత గొడవ జరుగుతోంది? ఏంజరిగింది" అన్నాను.

వాళ్ళు సమాధానం చెప్పేలోగానే సుమేర్‌మల్ మధ్యలో కల్పించుకుంటూ "నేను చెప్పనా బాబుగారు? ఇదంతా ఆ వజీర్‌పురా రౌడీమూక పనేనని" అన్నాడు.


"లేదు-లేదు వజీర్‌పురా వాళ్ళ తప్పు లేశమాత్రం కూడా లేదు. అమర్‌నాథ్ అనవసరంగా విశ్వనాథ్‌ని చెంపదెబ్బ కొట్టి ఆయన సైకిల్‌ని లాక్కున్నాడు. అంతటితో ఆగాడా అడ్డమైన బూతులు కూడా తిట్టాడు" అన్నాడు మోహన్‌లాల్.

"చాల్లే ఊరుకో! తప్పంతా ఆ విశ్వనాథ్‌దే. మీరే చెప్పండి ఆ అమాయకుడు పాండే ఎవర్నేమన్నాడు? పాపం కూరలు కొనుక్కుని యింటి కొస్తున్నాడా... అంటూ మధ్యలో ఓ వ్యక్తి కల్పించుకొని మాట్లాడబోతుంటే అప్పటివరకు మౌనంగా అన్నీ వింటున్న నేను "ఎవరు? ఆ పిచ్చివాడు పాండు గురించి కాదు కదా" మీరు మాట్లాడేది?" అన్నాను.

"ఆహా! అక్షరాలా అతగాడి గురించే మేం మాట్లాడుకునేది. కూరలు కొనుక్కొని యింటికి వస్తున్న అతగాడిని ఆటలు పట్టించటం మొదలెట్టారు పిల్లమూక. వాళ్ళని భరించలేని పాండే పరుగు లంఘించుకున్నాడు. అటుగా సైకిల్ మీద వస్తున్న విశ్వనాథ్ పాండే పరిగెత్తడం చూసి పిల్ల మూకని తిట్టకపోగా వాళ్ళ వెనకాలే పడి పాండేని అల్లరి పెట్టటం మొదలెట్టాడు. ఇక పాండే అవస్థ చూడాలి" అంటూ పెద్దగా నవ్వటం మొదలెట్టాడు మహావీర్.

"పాపం ఆ పిచ్చివెధవ ఎదురుదెబ్బ తగలడంతో కింద పడిపోయాడు. దాంతో బుట్టలో వున్న కూరలన్నీ చెల్లాచెదరుగా యిటు అటు పడిపోయాయి. దాంతో పిల్లలు మరింతగా రెచ్చిపోయి కిందపడ్డ కూరలని ఏరి అతని మీదకి గురిపెట్టి కొట్టడం మొదలెట్టారు".

"కొద్దిలో తప్పిపోయింది కానీ, లేకపోతే "పైప్‌లైన్" కోసం తవ్విన గుంటలో పడి బుర్ర బద్దలు కొట్టుకునేవాడే ఆ పిచ్చి పాండే".



"అయ్యో అంతటితో ఆగిందా ఆ తమాషా! కూరలు అక్కడే వదిలేసి పాండే పాపం పరుగు లంఘించుకొన్నాడు. విశ్వనాథ్ అతన్ని వదలకుండా యింటివరకు తరిమికొట్టాడు. పాండే ఏం చేయలేక ఏడుస్తూ యింట్లోకెళ్ళాడు. "ఒరేయ్ పాండే కూరలు పట్టుకెళ్ళు!" అంటూ విశ్వనాథ్, ఆ కోతిమూక అరవటం మొదలెట్టారు.

దాంతో కోపం పట్టలేని పాండే తమ్ముడు అమర్‌నాథ్ బయటికొచ్చి విశ్వనాథ్‌ని పట్టుకొని చంప పగిలేలా కొట్టడమే కాకుండా సైకిల్‌ని కూడా లాక్కున్నాడు. ఏం చేయలేని విశ్వనాథ్ అతని మీద తిట్ల దండకం మొదలెట్టాడు".

"ఊరుకో! విశ్వనాథ్ ఒక్కమాట కూడా అనలేదు. అమర్‌నాథే అతన్ని తిట్టి మొహం మీద ఉమ్మేసాడు".

"ఏంటీ! మరీ అలా అబద్ధాలాడతావు. ఆ గొడవంతా జరిగినప్పుడు నేనక్కడే వున్నాను. అమర్‌నాథ్ అతని మొహం మీద ఉమ్మనే లేదు. రెండు తగిలించి, సైకిల్ లాక్కున్నాడంతే".

"ఇంతకీ జరిగిందేవిటో చెప్తారా? కాస్తా?" అన్నాను నేను విసుగ్గా.

"నే చెప్తా వినండి. అమర్‌నాథ్‌తో దెబ్బలు తిన్నాక విశ్వనాథ్ సరాసరి రామ్‌సేవక్ దగ్గరకొచ్చి జరిగిందంతా చెప్పాడు. ఆపై అతన్ని బతిమిలాడుకుంటూ" ఈరోజు అమర్‌నాథ్‌వల్ల నా పరువు కాస్త గంగలో కలిసిపోయింది. ఊర్లో వాళ్ళకి నా మొహం ఎలా చూపను" అంటూ వాపోయాడు.

"ఎంత ధైర్యం అమర్‌నాథ్‌కి" అంటూ రామ్‌సేవక్ బస్తీలో వాళ్ళని పోగుచేసి గాంధీనగర్‌మీదకి దండయాత్రకొచ్చాడు.

"విషయం ఏవిటంటే దీనానాథ్ దగ్గరికి ఉద్యోగం కోసం రోజూ జనులు వస్తూ-పోతూ వుంటారు. వచ్చినవాళ్ళు ఉద్యోగం చూపించమని ఆయన కాళ్ళా-వేళ్ళా పడుతుంటారు. ఇదంతా రోజూ చూసే పాండే-వాళ్ళ లాగానే అందరి వెనక ఉద్యోగం యిప్పించమని ప్రాధేయపడుతుంటాడు అంతే!"

"రామ్‌సేవక్‌ని చూడగానే మన గాంధీనగర్‌లో వుంటున్న వాళ్ళ వాళ్ళకి ఎక్కడలేని ధైర్యం వచ్చి లాఠీలు పట్టుకొని గుంపులో కలిసిపోయారు".

"ఏంటి విశ్వనాథ్ వజీర్‌పురాలో వుంటాడా?" అంటూ ఆశ్చర్యపోయాడో వ్యక్తి.

"లేదు-లేదు ఇక్కడే వుంటాడు. ఆ బోటనీ ప్రొఫెసర్ లేదు ఆయన పుత్రరత్నమే".

"విను, యిక్కడి నుంచే గుంపంతా అరుచుకుంటూ బయలుదేరింది. ముందు రామ్‌సేవక్ నడుస్తుంటే వెనకాల ఆ విశ్వనాథ్ లాఠీ చేత్తో పట్టుకొని రొమ్ము విరుచుకొని మరీ బయలుదేరాడు".

"ఆ గుంపుని చూసేసరికి గాంధీనగర్ అంతా అట్టుడికిపోయింది".

"అయితే ఆ గుంపుని ఎవరు ఆపటానికి ప్రయత్నించలేదా?"

"భలే చెప్పావులే! ఉద్రేకంతో వూగిపోతున్న ఆ గుంపుని చెదరగొట్టే ధైర్యం ఎవడికుంది?"

"ఈ గొడవ కారణంగా ఏదో ఉపద్రవం ముంచుకు రాబోతోందని అందరికీ బాగా అర్థం అయిపోయింది" అందుకే కాబోలు అంతా తమ దుకాణాలని సైతం వదిలి ఆ గుంపుతో పాటుగా సాగిపోయారు".

"వీళ్ళంతా కలిసి ఆ పిచ్చివెధవ పాండే యిల్లుని ఘొరావ్ చేస్తారులే. ఇక ఇప్పుడు చూడాలి తమాషా".

"శర్మ మధ్యలో వచ్చి కల్పించుకోకుండా వుండివుంటే భలే మజాగా వుండేది".

"శర్మ, హీరాలాల్ యిద్దరు జనసందోహాన్ని చేతులెత్తి ప్రార్థించారు. అంతటితో ఆగకుండా రామ్‌సేవక్ కాళ్ళా-వేళ్ళా పడి బతిమాలుకుని, అమర్‌నాథ్ యింట్లోకి వెళ్లి సైకిల్ తెచ్చి విశ్వనాథ్‌కి అప్పగించారు. యింత జరిగితే కానీ జనులు శాంతించలేదు.

"ఏమన్నా అను... ఆ పిచ్చి పాండే తమ్ముడు అమర్‌నాథ్ చాలా ధైర్యం చేసాడనే చెప్పాలి".

మరే! ధైర్యస్థుడు కాబట్టే అంత గుంపుని ఒక్కడే ఎదుర్కోగలిగాడు".

"నువ్వొక విషయం మరిచావు. మళ్ళీ పెద్ద అన్నగారు దీనానాథ్ పాండే యింట్లో వుండి వుంటే అసలు ఇంత గొడవ జరిగేదే కాదు".

ఎవరు దీనానాథ్ పాండేయంటే ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లో పనిచేస్తాడు అతనేనా?"

"ఆహా ఆయనే చాలామంచి వ్యక్తి".

ఇదెక్కడి విడ్డూరం! అన్నగారు ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లో పనిచేస్తుంటే ఇతగాడేవిటి ఉద్యోగం కోసం అందరి వెనకాల పడతాడు?"

"అయ్యో మీకసలు విషయం అర్థం కాలేదు. పాండే మీరనుకున్నంత పిచ్చివాడేం కాదు. ఇంటి పనంతా అతనే చేస్తాడు. రోగిష్టి తండ్రికి సేవ చేస్తాడు".

"అయితే మరి..."

"విషయం ఏవిటంటే దీనానాథ్ దగ్గరికి ఉద్యోగం కోసం రోజూ జనులు వస్తూ-పోతూ వుంటారు. వచ్చినవాళ్ళు ఉద్యోగం చూపించమని ఆయన కాళ్ళా-వేళ్ళా పడుతుంటారు. ఇదంతా రోజూ చూసే పాండే-వాళ్ళ లాగానే అందరి వెనక ఉద్యోగం యిప్పించమని ప్రాధేయపడుతుంటాడు అంతే!"

"అవునా!"

"కాకపోతే!"

"ఏమైనా అనండి, శర్మగారు మధ్యలో వచ్చి వినోదానికి అడ్డుపుల్ల వేసారు."

"పోరా! పో! ఆయనే కనుక అడ్డం రాకపోయివుంటే ఎంత గొడవ జరిగేది? ఒకళ్ళిద్దరు చచ్చుండేవారు. ఓ పది పదిహేను మందికి దెబ్బలు తగిలుండేవి. ఇన్ని గొడవలు జరిగాక నువ్వు హాయిగా వుండగలిగేవాడివా?"

"పాపం పాండే 4- 5 రోజుల వరకు యింట్లోంచి బయటికి రాలేదు కదా!"

ఆ మాటలు వినగానే నా ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. నేను హాయిగా ఊపిరి పీల్చుకున్నాను. సోమవారంనాడు రాబోయే ఆపద తొలగిపోయినందుకు సంతోషపడుతూ యింటివేపుగా నడిచాను. ●